ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 197 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 25 అక్టోబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## ఉద్యోగుల సమస్యలపై
# కేబినేట్ సబ్ కమిటీ
### సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 24 (ప్రభాత ఉదయం): ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేబినెట్ సబ్ కమిటీని నియమించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షుడిగా, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా.. కె.కేశవరావు ప్రత్యేక ఆహ్వానితుడిగా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పెండింగ్ డీఏలపై శుక్రవారం సాయంత్రంలోగా నిర్ణయం ..మిగతా 2లో



## రాహుల్ ఆలోచనలకు
# భిన్నంగా రాష్ట్ర కాంగ్రెస్
### ఫిరాయింపులను ప్రోత్సహించడం ఆశ్చర్యం
### ఫిరాయించిన వారికే ప్రత్యేక గుర్తింపు
### పోచారం శ్రీనివాసరెడ్డికి సలహాదారు పదవా
### ఎఐసిసికి రాసిన లేఖలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆవేదన

హైదరాబాద్, అక్టోబర్ 24 (ప్రభాత ఉదయం): కేసీఆర్‌లాగే కాంగ్రెస్.. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం పట్ల ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారని అంటూ ఎఐసిసికి రాసిన లేఖలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనలకు భిన్నంగా పార్టీ నడుస్తోందని తెలిపారు. పార్టీ ఫిరాయించిన వారికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వబడుతుందనే అభిప్రాయాన్ని కల్గించే విధంగా పార్టీ వ్యవహారం ఉన్నట్లు పేర్కొన్నారు. ఫిరాయింపు ..మిగతా 2లో

# జైలుకెళ్లడానికైనా సిద్ధమే: కేటీఆర్



### మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో రైతు పోరు బాట
### బహిరంగ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేటీఆర్
### రేవంత్ రెడ్డిని చిట్టినాయుడుగా సంభోదించిన కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 24 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై ఆదిలాబాద్‌లో అగ్గి మొదలైందని, రైతులు, ప్రజల కోసం పోరాడుతూ తాము జైలుకెళ్లటానికైనా సిద్ధమేనని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీల పేరు చెప్పి అధికారపగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ మోసాలను వచ్చే నెల మహారాష్ట్రలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా సహా ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయటం లేదని ఆరోపించారు. మాజీ మంత్రి జోగు రామన్న నేతృత్వంలో ఆదిలాబాద్‌లోని రాంలీల మైదానంలో బీఆర్ఎస్ ఏర్పాటుచేసిన నిరసన బహిరంగ సభలో బీఆర్ఎస్ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**మోసపూరిత హామీలేనా?:** తనపై ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ పోలీసులు కేసు నమోదు చేయటాన్ని ప్రస్తావించిన కేటీఆర్.. రైతుల పక్షాన జైలుకెళ్లడానికైనా సిద్ధమేనని ప్రకటించారు. చంద్రబాబునాయుడు, వైఎస్‌రాజశేఖర్‌రెడ్డిలతో తలపడిన తమకు ఈ చిట్టినాయుడైన రేవంత్‌రెడ్డిని ఎదుర్కోవటం ఓ లెక్కా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసే అన్నీ మోసపూరిత వాగ్దానాలపై ఆదిలాబాద్‌లో ప్రారంభమైన ఉద్యమ సెగను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ వేరు కాదనీ, దొందూ దొందేననీ విమర్శించిన కేటీఆర్.. అదానీ దృష్టిపడిన ఆదిలాబాద్, బెల్లంపల్లిలోని సిమెంటు పరిశ్రమలతో పాటు సింగరేణిని కాపాడుకోవటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. గుజరాత్‌లో ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పత్తి పంటకు క్వింటాల్‌కు రూ. 8800 ఇవ్వటానికి సిద్ధపడినట్లే తెలంగాణలో కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**కేటీఆర్‌కు ఘనస్వాగతం:** పత్తి పంటకు మద్దతు ధర విషయంపై బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలను వదిలిపెట్టే ప్రసక్తేలేదని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ అన్నట్లు వ్యవహరించే కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా పనిచేసేది కేవలం బీఆర్ఎస్ మాత్రమేనని తెలిపారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా భారత రాష్ట్ర సమితే కాదు ..మిగతా 2లో

# మోడీ, అమిత్ షాలతో ఒమర్ భేటీ
### కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై వినతి



న్యూఢిల్లీ, అక్టోబర్ 24 (ప్రభాత ఉదయం): జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి ఢిల్లీలో పర్యటిస్తోన్న నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా గురువారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలతో భేటీలో జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కోరారు. ఇదే విషయమై కేంద్రాన్ని కోరుతూ ఇటీవల ఒమర్ మంత్రివర్గం తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. దానికి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆమోదం కూడా తెలిపారు. తాజాగా భేటీలో ఆ తీర్మానాన్ని ప్రధానికి అందించనున్నట్లు తెలుస్తోంది. ప్రధానిని కలుసుకోవడానికి ముందు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఒమర్ భేటీ ..మిగతా 2లో

# పరస్పర భద్రత సూత్రం ఆధారంగా ఒప్పందం
### సరిహద్దుల్లో భారత్, చైనా ఒప్పందంపై రాజ్‌నాథ్



న్యూఢిల్లీ, అక్టోబర్ 24 (ప్రభాత ఉదయం): వాస్తవాధీన రేఖ వెంబడి గత నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ భారత్- చైనాల మధ్య ఇటీవల కీలక గస్తీ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఈ ఒప్పందంపై కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. ఈ సందర్భంగా చర్చలకు ఉండే శక్తి ప్రాముఖ్యతను వివరించారు. పరస్పర భద్రత సూత్రం ఆధారంగా ఇరుదేశాల మధ్య సరిహద్దు పరిస్థితులను పునరుద్ధరించేందుకు ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. పెట్రోలింగ్, కీలక ప్రాంతాల్లో వ్యవహరించాల్సిన తీరుపై ఒప్పందంలో స్పష్టంగా ఉంది. కీలక ప్రాంతాల్లో పెట్రోలింగ్, పశువుల మేత విషయాల్లో ఏకాభిప్రాయం కుదిరింది. ఈ భేటీ ద్వారా సమస్య పరిష్కారాలకు అవకాశం దొరికింది. చర్చలు ఫలించాయి. చర్చలకు ఉండే శక్తి ఇదే' అని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లు ఈ ఒప్పందానికి ..మిగతా 2లో

## దీపావళికి 2 వేల
# ప్రత్యేక రైళ్లు
### కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి



న్యూఢిల్లీ, అక్టోబర్ 24 (ప్రభాత ఉదయం): దీపావళి, ఛట్‌పూజ పండుగల సందర్భంగా 2వేల ప్రత్యేక రైళ్లను నడిపించనున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ నిర్ణయంతో రెండులక్షల మంది ప్రయాణికులకు ఎంతో ఊరటనిస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ గురువారం సమావేశమైంది. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అనంతరం మంత్రివర్గ నిర్ణయాలను అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వివరించారు.



# వరంగల్‌లో రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్
### రూ.650 కోట్ల వ్యయంతో ఏర్పాటు
### యాదాద్రి వరకు ఎంఎంటిఎస్ పొడిగింపు
### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 24 (ప్రభాత ఉదయం): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 90 శాతం రైల్వేలైన్ల విద్యుదీకరణ జరిగిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌తో రాష్ట్ర ఎంపీల సమావేశం అనంతరం రైల్ నిలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామన్నారు. వరంగల్‌లో రూ.650 కోట్లతో రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దక్షిణ మధ్య రైల్వే బడ్జెట్‌ను పెంచామన్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 5 వందే భారత్ రైళ్లు ఉన్నాయని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. మరిన్ని తీసుకొస్తామన్నారు. రూ.720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పనులు చేస్తున్నట్లు వివరించారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. యాదాద్రి వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. దీనికి రూ.650 కోట్లు అవసరమని చెప్పారు. ఘట్‌కేసర్ వరకు ప్రస్తుతం ఎంఎంటీఎస్ సర్వీసు ఉందని.. అక్కడి నుంచి యాదాద్రి వరకు విస్తరించాల్సి ఉందని పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం సహకరించకున్నా ఎంఎంటీఎస్ సర్వీసును పొడిగిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఎంపీలు సురేష్‌రెడ్డి, కావ్య, డీకే అరుణ, రఘునందన్‌రావు పాల్గొన్నారు. పలు సమస్యలను వారు జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈదుల నాగులపల్లి స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని ఎంపీ రఘునందన్ రావు కోరారు.

## తెలంగాణలోనే సొంతంగా
# సీడ్ గార్డెన్
### మలేషియా పర్యటనలో మంత్రి తుమ్మల



హైదరాబాద్, అక్టోబర్ 24 (ప్రభాత ఉదయం): భవిష్యత్తులో తెలంగాణలోనే సొంతంగా సీడ్ గార్డెన్ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మలేసియా పర్యటనలో ఉన్న మంత్రి.. రెండో రోజు పలు సంస్థలను సందర్శించారు. ప్రపంచంలో అతి పెద్ద వ్యాపార ఆధారిత క్రూడ్ ఫామాయిల్ ఉత్పత్తిదారుల్లో ఒకటైన ..మిగతా 2లో

# జైలుకెళ్లడానికైనా సిద్ధమే: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి...

భారత రైతు సమితిగా పనిచేస్తుందని కేటీఆర్ భరోసానిచ్చారు. శాసనసభ, పార్లమెంటు ఎన్నికల తర్వాత తొలిసారిగా ఆదిలాబాద్ వచ్చిన కేటీఆర్‌కు ఆదిలాబాద్ ప్రజలనుంచి ఘనస్వాగతం లభించింది. సభ విజయవంతం కావటంతో గులాబీ శ్రేణుల్లో ఆనందం వెల్లివిరిసింది.

**తెలంగాణలో మోసపోయామని చెప్పండి**

తెలంగాణలో మోసపోయామని, మహారాష్ట్రలో చెప్పి కాంగ్రెస్‌ను ఓడించాలని సరిహద్దు గ్రామాల ప్రజలకు కెటిఆర్ పిలుపునిచ్చారు. పొరుగున ఉన్న మహారాష్ట్రలో ఈ నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ లుచ్చగాళ్లకు ఓటేయొద్దని మహారాష్ట్రలో ఉన్న బంధువులకు, దోస్తులకు గట్టిగా చెప్పండి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. ఆదిలాబాద్ జిల్లాలోని రామ్‌లీలా మైదానంలో ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. నవంబర్‌లో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఆదిలాబాద్ వాళ్లకు అక్కడ చుట్టాలు, దోస్తులు ఉంటారు. కాంగ్రెస్ లుచ్చగాళ్ల సంగతి వారికి తెలియజెప్పండి.. మేం మోసం పోయాం.. మీరు మోసపోకండి అని చెప్పండి. రైతు భరోసా, తులం బంగారం, పెన్షన్లు, స్కూటీలు అని కథలు చెప్పి ఓట్లు వేయించుకుని మోసం చేశారు. ఈ కాంగ్రెస్ కు ఓట్లేస్తే మళ్లా మోసం జరుగుతదని గట్టిగా చెప్పాలని



కేటీఆర్ సూచించారు. ఈ పోరాటం ఈ రోజుతో ఆగిపోయేది కాదు. ఈ ఆదిలాబాద్ ఆనాడు తెలంగాణ ఉద్యమంలో ముందుంది. బోరాజ్ చెక్ పోస్టు వద్ద వంటావార్పు చేస్తే నేనొచ్చాను. ఇవాళ ఆదిలాబాద్‌లో అగ్గి రాజుకుంది. ముఖ్రా కే గ్రామం వద్ద ఆగి సర్పంచ్ మీనాక్షిని పలుకరించాను. రైతులంతా కలిసి పోస్టు కార్డులు కొన్నారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా, పెన్షన్, తులం బంగారం, స్కూ.. ఎక్కడికి పోయినయ్.. ఎప్పుడు ఇస్తావని రాహుల్ గాంధీకి ఉత్తరం రాశారు. ఆనాడు ఉగ్గుపాలతోనే ఉద్యమాలు నేర్పిన గడ్డ ఆదిలాబాద్.. కుమ్రంభీం పుట్టిన ఈ గడ్డలో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పే రోజు వస్తదని కేటీఆర్ అన్నారు. రుయ్యాడ గ్రామంలో రైతుల మీద కేసులు పెట్టారని తెలిసింది. రుణమాఫీ మోసాన్ని నిరసిస్తూ దిష్టిబమ్మ కాలపెడితే కేసులు పెట్టారు. వాళ్లను జైల్లో పెడుతారట.. రైతులు బాధపడాల్సిన అవసరం లేదు. మీ కోసం మేం జైలుకు వెళ్తాం.. మీరు ఇదే విధంగా మాకు శక్తినివ్వండి.. కాంగ్రెస్ నాయకులతో మేం కొట్లాడుతాం.. కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమంలో కొట్లాడినట్టే రేపు కూడా పోరాడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

**సరిహద్దు రాష్ట్రాల నుంచి మహారాష్ట్రకు డబ్బులు**

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక సరిహద్దులను మూసేయాలని, భద్రతను కట్టుదిట్టం చేయాలని శివసేన నాయకుడు కిరణ్ పావస్కర్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. ఎందుకంటే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక నుంచి మహారాష్ట్రకు వందల కోట్ల నగదును తరలించే అవకాశం ఉందని కిరణ్ పేర్కొన్నారు. ఈ నగదును మహా వికాస్ అఘాడీకి ఖర్చు పెట్టే అవకాశం ఉందని తెలిపారు. కిరణ్ లేవనెత్తిన అంశం జాతీయ మీడియాలో ప్రచురితం అయింది. ఈ వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ అంశంపై కేటీఆర్ కూడా ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంగా మారిందని ధ్వజమెత్తారు. ఆర్ఆర్ ట్యాక్స్ నుంచి హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల ఎన్నికలకు నిధులు సమకూర్చుతున్నారని కేటీఆర్ ఆరోపించారు.

# రాహుల్ ఆలోచనలకు భిన్నంగా రాష్ట్ర కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి...

ఎమ్మెల్యేలతో పోచారం ఇంట్లో సమావేశం నిర్వహించడాన్ని ఎమ్మెల్సీ తీవ్రంగా తప్పుబట్టారు. ముఖ్య అనుచరుడి హత్యతో తీవ్ర మనోవేదనకు గురైనఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై కూడా అసహనాన్ని వ్యక్తం చేస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. తాజాగా పార్టీలో కొనసాగుతున్న పరిణామాలను జీర్ణించుకోలేక తీవ్ర మానసిక వ్యధతో ఏఐసీసీ చీఫ్‌కు జీవన్ రెడ్డి లేఖ రాశారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ గురించి లేఖలో సంచలన వ్యాఖ్యలు చేశారు. నేను నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ నన్ను అగౌరవంగా, అవమానంగా చూస్తోంది. నా భవిష్యత్తు కార్యాచరణ పార్టీనే మార్గదర్శకం చేయాలి. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి , పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లకు ఎమ్మెల్సీ లేఖ రాశారు. కాంగ్రెస్‌లో తనకు జరుగుతున్న అన్యాయం, పరిణామాలను వివరిస్తూ ఎమ్మెల్సీ లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే సంజయ్ అనుచరుడిగా భావించే సంతోష్ కాంగ్రెస్ పార్టీ నాయకుడిని హత్య చేశాడని వెల్లడించారు. పదేండ్లు అనేక దౌర్జన్యాలను ఎదుర్కన్నామని.. కాంగ్రెస్ ముసుగు కప్పుకొని మళ్ళీ దౌర్జన్యాలు చేస్తామంటే ఎలా భరించాలని అడిగారు. పార్టీని కన్నతల్లి అనుకున్నానని.. పార్టీ తనకు అనేక అవకాశాలు ఇచ్చిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్‌పై పోటీ చేయమంటే చేశానన్నారు. నన్ను ప్రతిపక్షాలు ఏకాకిని చేసి హేళన చేసినా తట్టుకొని నిలబడ్డాను. పార్టీ అధిష్ఠానం నా గౌరవాన్ని కాపాడతానని నోటిమాటగా చెప్పింది. పార్టీ ఫిరాయింపులకు ముఠా నాయకుడు ఉన్నాడు. పార్టీ ఫిరాయింపులకు ముఠా నాయకుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి. పది మంది ఎమ్మెల్యేలు లేకపోతే ప్రభుత్వం కొనసాగాదా.. రాహుల్ ఏం చెప్తున్నాడు. మనం ఏం చేస్తున్నాం. మా పార్టీ నాయకుడు గంగారెడ్డిని చంపిన వ్యక్తి బీఆర్ఎస్ తరపున ఎన్నికల్లో డబ్బులు పంచారు. గంగారెడ్డిని చంపిన సంతోష్‌పై అనేక క్రిమినల్ కేసులు ఉన్నాయి. గంగారెడ్డిని మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నేను ప్రపోజ్ చేశారు. ఎవరి అండదండలు చూసుకొని సంతోష్ మా నాయకుడిని చంపాడు అంటూ ఆయన ప్రశ్నలు కురిపించారు. అలాగే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై కూడా జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కాంగ్రెస్ పార్టీ పుట్టిందే మా ఇంట్లో అంటున్నాడు. మీ ఇంట్లో కాంగ్రెస్ పార్టీ పుడితే పరాయి ఇంటికి ఎందుకు వెళ్ళాడు. సంజయ్ ఎప్పుడైనా కాంగ్రెస్ పార్టీకి ఓటేశాడా.. నేను రాజీవ్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరాను. సంజయ్ చొక్కారావు మనవడిని అని చెప్పుకుంటున్నారు. ఇందిరా గాంధీ కష్టకాలంలో ఉన్నప్పుడు చొక్కారావు జనతా పార్టీలో చేరాడు. సంజయ్ టీఆర్ఎస్‌లో ఎన్నడూ లేడు. అక్కడి ఉద్యమ నాయకుల మధ్య సమన్వయ లోపం వల్ల సంజయ్ తెరపైకి వచ్చాడు. అభివృద్ధి జరగాలంటే అధికార పార్టీలో చేరతామంటే ప్రజాస్వామ్యం ఉంటుందా. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కేసీఆర్ పరిస్థితి ఏమయిందని అంటూ వ్యాఖ్యలు చేశారు. అలాగే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పైనా ఎమ్మెల్సీ విరుచుకుపడ్డారు. భట్టికి ప్రతిపక్ష నేత హోదా పోవడానికి కారణం పోచారమన్నారు. పోచారం లాంటి వాడిని పార్టీలో చేర్చుకోవడం ఏంటి? పోచారం సలహాదారుడు ఏంటి. పార్టీ ఫిరాయింపుల క్రమబద్ధీకరణ విషయంలో పోచారం సలహాలు ఇవ్వగలడు అంటూ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

# కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 24(ప్రభాత ఉదయం)రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.సక్రియ నాయక్ అన్నారు. గురువారం ధరూర్ మండలం పార్చర్ల క్లస్టర్ పరిధిలోని పార్చర్ల, మన్నాపురం మరియు గుర్రంపల్లి గ్రామాలను వ్యవసాయ అధికారులు సందర్శించి వానకలం 2024లో సీజన్ లో సాగు చేసిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటల వివరాలు ఆన్ లైన్ నమోదు చేశారు. అనంతరం మన్నాపురంలో రైతులకు వరి పంటలో మద్దతు ధర మరియు సన్న రకాలు సాగు చేసిన రైతులకు క్వింటాకు రూ.500 వర్తించే విధి విధానాల గురించి అవగాహన కల్పించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని విక్రయిస్తే బోనస్ అందిస్తారన్నారు. గ్రేడ్-ఏ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2320, గ్రేడ్-బీ రకానికి రూ.2300 మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఈఓ ఆంజనేయులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

**జిల్లాస్థాయి రైతు సదస్సును విజయవంతం చేద్దాం...**

ఈనెల 26న గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించు జిల్లా స్థాయి రైతు సదస్సుకు రైతులందరూ అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయవలసిందిగా రైతులకు జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్ కోరారు.

# బైక్‌పై నుండి పడి మహిళ మృతి

కేటిదొడ్డి, అక్టోబర్ 24(ప్రభాత ఉదయం) బైక్‌పై వెళ్తున్న ఓ మహిళ ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందింది. ఈ ఘటన గురువారం కేటిదొడ్డి మండలం కుచినెర్ల గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని నందిన్నె పోస్ట్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్న సుజాత (46) పోస్టు ఆఫీస్ నిమిత్తం మాచర్లకు వెళ్తుండగా కుచినెర్ల గ్రామశివారులో రోడ్డుపై గుంతలు ఉండడం వల్ల బైక్ అదుపు తప్పి ఇద్దరు బైక్‌పై నుండి పడ్డారు. ఈ ఘటనలో సుజాత గాయపడగా చికిత్స కోసం రాయచూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో ఆమె మృతి చెందింది.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పోస్ట్ మ్యాన్ సుజాత

# మోడీ, అమిత్ షాలతో ఒమర్ భేటీ

అయిన సంగతి తెలిసిందే. జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా కల్పించాలనే అంశంపై వీరిద్దరూ చర్చించినట్లు సమాచారం. ఈమేరకు జాతీయమీడియా కథనాలు వెల్లడించాయి. ఈ భేటీలో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వానికి కేంద్రం మద్దతు తెలపడంతో పాటు, రాష్ట్ర హోదా పునరుద్ధరణపై కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం. జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత తొలిసారి ఇటీవల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఎన్‌సీ- కాంగ్రెస్ కూటమి విజయం సాధించగా.. ఒమర్ అబ్దుల్లా సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని రాష్ట్ర కేబినెట్ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఈ తీర్మానాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా సైతం ఆమోదించారు. జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా పునరుద్ధరణ అంశంపై వీరిద్దరూ చర్చించినట్లు సమాచారం. ఈ పునరుద్ధరణ పక్రియను ప్రారంభించే యోచనలో కేంద్రం ఉందని, ఈ మేరకు హామీ లభించిందని కథనాలు వెలువడ్డాయి. జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత తొలిసారి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్‌సీ-కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. 90 స్థానాల శాసనసభలో ఎన్‌సీ 42 సీట్లలో, కాంగ్రెస్ 6 స్థానాల్లో నెగ్గింది.



ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

# ఎల్ఆర్.ఎస్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలి: కలెక్టర్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 24(ప్రభాత ఉదయం)వచ్చిన ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. గురువారం గద్వాల్ మున్సిపల్ పరిధి, ఎర్రవల్లి లో ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో మొబైల్ యాప్ ద్వారా నిర్వహిస్తున్న విధానాన్ని అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను సక్రమంగా పరిశీలించి ప్రతి దరఖాస్తు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. క్షేత్రసందర్శనలో భాగంగా మొబైల్ యాప్‌ను ఉపయోగించి ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తు వివరాలను తెలుసుకున్నారు. లేఅవుట్ ప్లాట్స్ ప్రాంతాన్ని , ప్లాట్ గుర్తింపు కోసం ఏర్పాటు చేసిన రాళ్లను ఆయన పరిశీలించారు. లేఅవుట్ పేర్లు, యజమాని వివరాలు, చదరపు గజాల పరిమాణం, రోడ్డు ప్రభావిత ప్రాంతం వంటి అంశాలను పూర్తి స్థాయిలో నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్లాట్ ఫోటోలను, లాటిట్యూడ్-లంగిట్యూడ్ నాలుగు పైపులు, డాక్యుమెంట్ల అప్‌లోడ్ విషయంలో ముఖ్యంగా లేఅవుట్ సంబంధిత పత్రాలపై పూర్తి జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రభుత్వ భూములను గుర్తిస్తూ, భూములు నీటి వనరుల బఫర్ జోన్ , నాలా, చెరువులు, కోర్టు కేసులు ఇలాంటి విషయాలను పరిశీలించుకునలని సంబంధిత అధికారులకు సూచించారు.దరఖాస్తుదారులను సంప్రదించి సమయానుసారం అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని అన్నారు. ప్రతిరోజూ వచ్చిన దరఖాస్తులను పూర్తి చేసి మొబైల్ యాప్‌లో నమోదు చేయడం జరగాలని అన్నారు. ముఖ్యంగా మున్సిపల్, గ్రామ స్థాయిలో నీటి పారుదల శాఖ పెండింగ్ ఎల్.ఆర్.ఎస్ దరకాస్తులను త్వరగా పూర్తిచేయాలని నీటి పారుదల ఈ.ఈ కు ఆదేశించారు. గ్రామపంచాయతీ, మున్సిపల్, రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పెండింగ్ దరకాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఎర్రవల్లి మండలంలోని ఎర్రవల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అన్ని డాక్యుమెంట్లు, లేఅవుట్ మ్యాప్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ... డిపిఓ,పంచాయతీ కార్యదర్శి లకు పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు.ముఖ్యంగా అప్రోచ్ రోడ్లు,రహదారికి ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అన్నారు. సమీపంలోని నీటి వనరులను పర్యవేక్షించాలని నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశించారు. ఆన్‌లైన్‌లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని, సంబంధిత దరఖాస్తుదారులను కాల్ చేసి, పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్, డిపిఓ శ్యాంసుందర్, ఇరిగేషన్ ఈ.ఈ శ్రీనివాస రావు, టౌన్ ప్లానింగ్ అధికారి కుర్మన్న, ఆర్.ఐ లు ,ఎ.ఈ లు, పంచాయత్ సెక్రటరీ,మున్సిపల్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# పరస్పర భద్రత సూత్రం ఆధారంగా ఒప్పందం

మొదటి పేజీ తరువాయి...

ఆమోదం తెలిపారు. కాగా.. ఎల్ఏసీ వెంబడి గస్తీ పునఃప్రారంభంపై భారత్- చైనా కీలక ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీని ప్రకారం.. 2020 నాటి యథాస్థితి ఎల్ఏసీ వెంబడి ఇక కొనసాగనుంది. ఇరు దేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లొచ్చు. ఈ ఒప్పందాన్ని ఇరుదేశాధినేతలు ఆమోదించారు.

# ఉద్యోగుల సమస్యలపై కేబినేట్ సబ్ కమిటీ

మొదటి పేజీ తరువాయి...

ప్రకటించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘంగా చర్చలు జరిపారు. దీపావళి తర్వాత శాఖల వారీగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కేబినెట్ సబ్ కమిటీ సమావేశమై చర్చిస్తుందని సీఎం తెలిపారు. జీవో 317పై మంత్రివర్గ ఉపసంఘం సమర్పించిన నివేదికపై కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు.



# సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్

**రూ.358 కోట్ల విడుదల కు సింగరేణికి భట్టి ఆదేశం**

**గతం కన్నా 50 కోట్లు అదనమని వెల్లడి**

హైదరాబాద్, అక్టోబర్ 24 (ప్రభాత ఉదయం): దీపావళి కానుకగా సింగరేణి కార్మికులకు బోనస్‌ను శుక్రవారమే చెల్లిస్తున్నామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సచివాలయంలో ప్రకటించారు. దీని కోసం సింగరేణి సంస్థ రూ.358 కోట్లను విడుదల చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌ను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సింగరేణిపై జరిగిన సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది చెల్లించిన దీపావళి బోనస్ కన్నా ఇది రూ.50 కోట్లు అధికం కావడం విశేషం. శుక్రవారం మధ్యాహ్నం సమయానికి దీపావళి బోనస్‌ను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. దీపావళి బోనస్ కింద ఒక్కొక్క కార్మికుడు రూ.93,750లు అందుకోనున్నారు. సంస్థలో పనిచేస్తున్న దాదాపు 40,000 మంది కార్మికులకు ఈ బోనస్ అందనుంది. బొగ్గు పరిశ్రమ కోసం జేబీసీసీఐ విధానాల్లో భాగంగా కంపెనీలు సాధించిన ఉత్పత్తి పరిమాణం ఆధారంగా కార్మికుల శ్రమకు ప్రోత్సాహకంగా ఈ బోనస్‌ను చెల్లించే పద్ధతి గత కొన్నేళ్లుగా అమలులో ఉంది. ఈ ఏడాది కూడా కోల్ ఇండియా స్థాయిలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా దీపావళి పండుగకు ముందే చెల్లింపులు జరిగేలా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలిచ్చారు. ఇటీవలే సింగరేణి ఉద్యోగులందరికీ 33 శాతం లాభాల వాటా కింద రూ.796 కోట్లను కంపెనీ పంపిణీ చేసిందని సింగరేణి సీఎండీ తెలిపారు.

# తెలంగాణలోనే సొంతంగా సీడ్ గార్డెన్

మొదటి పేజీ తరువాయి...

ఎఫ్‌జీవీ కంపెనీ సీడ్ గాడన్‌ను సందర్శించారు. నర్సరీలను, అధునాతన సాంకేతిక పద్ధతులతో ఉన్న విత్తన కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆ కంపెనీ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సొంతంగా సీడ్ గాడన్ ఏర్పాటుకు ఎఫ్‌జీవీ కంపెనీ సహకరించాలని కోరారు. అందుకు రాష్ట్ర భాగస్వామ్యంతో పని చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అనంతరం ఎఫ్‌జీవీ కంపెనీ గ్గి÷నైరీ కర్మాగారాన్ని సందర్శించి అక్కడ తయారు చేసే వివిధ ఉత్పత్తులను మంత్రి పరిశీలించారు. కంపెనీ తీసుకునే జాగ్రత్తలు, వివిధ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిమాండ్ గురించి మంత్రి తుమ్మలతోపాటు అధ్యయన బృందానికి ఆ సంస్థ ప్రతినిధులు వివరించారు.

# గ్రామీణ వలసలను ఆపే విధంగా వ్యవసాయ పరిశోధనలు ఉండాలి




సమావేశంలో మాట్లాడుతున్న రైతు కమిషన్ చైర్మన్ ఏ కోదండ రెడ్డి



రైతు కమిషన్ చైర్మన్ ఏ కోదండరామ్ ను సన్మానిస్తున్న డాక్టర్ ఆర్ ఎం సుందరం



వరి పరిశోధన సంస్థ పంట పొలాలను పరిశీలిస్తున్న రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి




మాట్లాడుతున్న డాక్టర్ ఆర్ ఎం సుందరం

## రైతు కమిషన్ చైర్మన్ ఏ కోదండ రెడ్డి

బుద్వేల్, అక్టోబరు 24(ప్రభాత ఉదయం): గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసల ను అధికట్టేందుకు వ్యవసాయ రంగంలో తగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ ఏ కోదండ రెడ్డి శాస్త్రవేత్తలను కోరారు . రాజేంద్రనగర్ లోని జాతీయ వరి పరిశోధనా సంస్థ( ఐఐ ఆర్ఆర్ ) లో గురువారం రైతు దినోత్సవాన్ని నిర్వహించారు . ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ , కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 500 మంది రైతులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా రైతు కమిషన్ చైర్మన్ ఎ.కోదండ రెడ్డి మాట్లాడుతూ, హరిత విప్లవం సమయంలో వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు . తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ పథకాన్ని ఆయన అభినందించారు. రైతు కమిషన్ నివేదికలో పొందుపరిచేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతుల సూచనలను పంపాలని ఆయన కోరారు . సమావేశంలో పాల్గొన్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ, మెరుగైన వరి రకాలు భారతదేశంలోనే కాకుండా మొత్తం దక్షిణాసియాలో కూడా గణనీయమైన ప్రభావాన్ని చూపాయని పేర్కొన్నారు. బంగ్లాదేశ్ లోని వరి సాగులో 60 శాతం కంటే ఎక్కువ భారతీయ రకాలు ఉన్నాయన్నారు . రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు వారి ఆకాంక్షలను నెరవేర్చేందుకు పరిశోధనలు సాగాలన్నారు. ఇక్రిశాట్ కు కొత్తగా నియమితులైన డైరెక్టర్ జనరల్ కూడా ప్రాథమికంగా రైస్ శాస్త్రవేత్త అని గుర్తు చేశారు . రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ ఎం సుందరం తన స్వాగత ప్రసంగంలో ఎక్రిప్ నుంచి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ గా అభివృద్ధి చెందిన వరకు జరిగిన వివరాలను వివరించారు. వాతావరణ మార్పులు మార్కెటింగ్ సవాళ్లు కారణంగా దేశంలోని రైతులు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి సైన్స్ అండ్ టెక్నాలజీ సాయంతో అభివృద్ధి చెందుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ఐఐఆర్ ఆర్ దృష్టి సాధించిందన్నారు. అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (అటారీ )డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీర మాట్లాడుతూ గత శతాబ్దపు 60 ల చివరలో జయ వరి రకం యొక్క మొదటి విడుదల నుంచి అన్నదాతకు చేస్తున్న సేవలను గుర్తు చేసుకున్నారు . అన్నదాతల సమస్యల పరిష్కారానికి కృషి విజ్ఞాన కేంద్రాలు , స్వచ్ఛంద సంస్థలు, యూనివర్సిటీ విస్తరణ విభాగ అనుబంధ శాఖలు పనిచేయాలన్నారు . ఈ సందర్భంగా రైతులందరికీ స్థానిక భాషలో వరి సంబంధిత సాహిత్యం, విత్తనాలను పంపిణీ చేశారు. వరిలో ఆధునిక సాంకేతికకు ఉపయోగించి అధిక దిగుబడి సాగించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ , కర్ణాటక రాష్ట్రాలలోని పలువురు రైతులను ఈ సందర్భంగా సన్మానించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు వరి శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చారు. ఈ సమావేశంలో ఐఐఆర్ఆర్ విభాగాల అధిపతులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



వ్యవసాయ విశ్వవిద్యాలయం నూతన వైస్ ఛాన్స్ లర్ అల్దా స్ జానయ్యను సన్మానించిన బీసీ ఉద్యోగులు

## ఉపకులపతి అల్దాస్ జానయ్యను సన్మానించిన విశ్వవిద్యాలయం బీసీ ఉద్యోగులు

రాజేంద్రనగర్, అక్టోబర్ 24(ప్రభాత ఉదయం)ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జానయ్యను విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాములు, డాక్టర్ రజనీకాంత్ ,డాక్టర్ సమీర్ కుమార్, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ పద్మావతి, డాక్టర్ శ్రీనివాస్ చారి, డాక్టర్ రాజయ్య , డాక్టర్ సతీష్ , నాన్ టీచింగ్ ఉద్యోగులు మహేశ్వర్, డి ఆర్ నాన్ టీచింగ్ డిప్యూటీ కంట్రోలర్ సత్యనారాయణ, మహేష్ ,సూపర్డెంట్ అసోసియేషన్ సభ్యులు బిక్షపతి, అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి దశరథ్, జాయింట్ సెక్రెటరీ రమేష్, కృష్ణ, సంతోష్, జనార్ధన్, భారీ సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని వైస్ ఛాన్స లర్ కి సన్మాన కార్యక్రమం నిర్వహించారు.



ఉపకులపతి అల్దాస్ జానయ్య సన్మానిస్తున్న విద్యార్థులు

## అగ్రి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆల్దాస జానయ్యను సన్మానించిన విద్యార్థులు

రాజేంద్రనగర్, అక్టోబర్ 24(ప్రభాత ఉదయం) వ్యవసాయ విశ్వవిద్యాలయం పీహెచ్డీ , పూర్వ విద్యార్థులుగా కొత్తగా నియమించబడిన ఉపకులపతి డాక్టర్ ఆల్దాస్ జానయ్య ని సాదరంగా ఆహ్వానించాము. ఆయన ఒక ప్రముఖ ఆర్థికవేత్తగా ప్రపంచ ప్రఖ్యాతిని కలిగి ఉన్నారు, అలాగే కాంగ్రెస్ పార్టీ 6 హామీల మేనిఫెస్టో సృష్టికర్త. ఈ కార్యక్రమంలో శ్రీ హరి ప్రసాద్ (NSUI రాష్ట్ర ఉపాధ్యక్షుడు), ఎ. బాలకోటి నాయక్ (PhD విద్యార్థి, AIASA విశ్వవిద్యాలయ అధ్యక్షుడు , రంగారెడ్డి జిల్లా యువ కాంగ్రెస్ నాయకుడు), రాజ్ కుమార్ (NSUI విశ్వవిద్యాలయ అధ్యక్షుడు), కె. శంకర (AIASA% విశ్వవిద్యాలయ చైర్మన్), శ్యామ్ సుందర్ రెడ్డి, పూర్వ విద్యార్థులు కవి రాజు, భావిత్ రాజ్ తదితరులు పాల్గొన్నారు

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



గండిపేట, అక్టోబర్ 24(ప్రభాత ఉదయం) మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాల్ గూడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10:30 నుండి 1:30 వరకు అల్కాపూర్ రోడ్ నెంబర్ 1 నుండి 13 వరకు, మధ్యాహ్నం రెండు నుండి ఐదు గంటల వరకు బాలాజీ నగర్ రోడ్ నెంబర్ 1 నుండి 15 వరకు, అల్కాపూర్ సెక్టర్ 2%ూ,2దీ,2జ,2఑% వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇబ్రహీం బాగ్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ కె సంతోష్ కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలి: కలెక్టర్ సంతోష్

### బోధన, మధ్యాహ్న భోజనం పనితీరును పరిశీలించిన కలెక్టర్ సంతోష్



మధ్యాహ్నం భోజనం వంటశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్



ఉపాధ్యాయుల బోధనలను విద్యార్థులతో అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 24(ప్రభాత ఉదయం)విద్యార్థులు మంచి మార్కులు సాధించే విధంగా నాణ్యమైన విద్య బోధన అందించాలని జిల్లా కలెక్టర్ బి. యం. సంతోష్ ఆదేశించారు. గురువారం ఎర్రవల్లి మండలం బీచుపల్లిలోని టి.జి. రెసిడెన్షియల్ స్కూల్ %డ% కాలేజీ (బాలుర) ఆకస్మికంగా తనిఖీ చేసి, తరగతి గదులను, హాస్టల్, మెస్ తదితర ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖిగా ముచ్చటించి, సబ్జెక్టుల వారిగా వారి విద్యాసామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ సంవత్సరం మంచి మార్కులు సాధించడంతో పాటు ఉత్తమ ఫలితాలు వచ్చే విధంగా ఉపాధ్యాయులు చొరవ చూపాలని అన్నారు. విద్యార్థులకు పాఠాలు స్పష్టంగా, అర్థమయ్యే విధంగా బోధించాలని, తద్వారా వారు సులభంగా అర్థం చేసుకుని మంచి ఫలితాలు సాధించగలుగుతారని అన్నారు. ప్రతి విద్యార్థి యూనిఫామ్ లో ఉండాలని, విద్యార్థులకు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తూ వారి విద్యాసామర్థ్యాన్ని వర్యీలిస్తు ఉండాలన్నరు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటానికి సరైన ఆహారం చాలా అవసరమని, అందుకు మెనూ ప్రకారం ప్రతిరోజు పౌష్టిక ఆహారం అందించాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పాఠశాలలో విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తూ, పాఠశాల ఫలితాలు మెరుగుపరచడానికి ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ అందరూ కలిసి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ సర్కిల్ విద్యుత్ ఎస్ ఈ శ్రీరామ్ మోహన్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

## రాజేంద్రనగర్ విద్యుత్ ఎస్ ఈ, ఎస్ఏఓలను సన్మానించిన ఉద్యోగులు

రాజేంద్రనగర్, అక్టోబర్ 24(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఈ శ్రీరామ్మోహన్, ఎస్ ఏ ఓ లోటేశ్వరయ్య లను రాజేంద్రనగర్ డివిజన్ విద్యుత్ ఉద్యోగులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఎస్ఈ, ఎస్ఏవోలను సన్మానించిన వారిలో ఉద్యోగులు రాజు, అర్జున్, శంకర్ రావు, సురేష్, ప్రశాంత్, అశోక్, అర్జున్, మెగనాథ్, వినోద్ తదితరులు వున్నారు.



ఎస్ ఏ ఓ లోకేశ్వరయ్యను సన్మానిస్తున్న ఉద్యోగులు

### వ్యవసాయ విశ్వవిద్యాలయంను జాతియ స్థాయిలో

## ఉత్తమ విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దుతాం

రాజేంద్రనగర్, అక్టోబరు 24(ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని జాతీయ స్థాయి లో అత్యుత్తమ పది సంస్థ లలో నిలపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య పిలుపునిచ్చారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయం 37 వ ర్యాంకు లో ఉందని రానున్న మూడేళ్ల లో విశ్వ విద్యాలయం పది లోపు ర్యాంక్ సాధించాలని ఆయన సూచించారు. ఈ మధ్యనే ఉపకులపతి బాధ్యతలు స్వీకరించిన ఆల్దాస్ జానయ్య గురువారం రాజేంద్ర నగర్ లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియం లో ఉద్యోగులు, విద్యార్థులతో సమావేశం అయ్యారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి లో ఈ ఉప కులపతి సహా ఇప్పటికి తాను 15 బాధ్యత లు చేపట్టానని వివరించారు. తనకు ఈ అవకాశం కల్పించిన కులపతి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి కి జానయ్య ధన్యవాదములు తెలిపారు. సమష్టి కృషి తో విశ్వవిద్యాలయాన్ని ముందు కి తీసుకెళదామని పిలుపు నిచ్చారు. జనవరి లోగా విశ్వ విద్యాలయ అధికారుల పదవులని భర్తీ చేస్తామన్నారు.సాంకేతిక అర్హత లేకపోయినా కొన్ని ప్రయివేటు సంస్థలు వ్యవసాయ కోర్సు లలో ప్రవేశాలు చేపట్టడం దురదృష్టం అన్నారు. సామాన్యులకి వ్యవసాయ విద్య ని అందుబాటులోకి తీసుకుని వచ్చేందుకు ప్రత్యేక కోటా సీట్లు భారీ గా పెంచి, ఫీజులు సగానికి



ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలు వేస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ అల్దాస్ జానయ్య



మాట్లాడుతున్న డాక్టర్ ఆల్దాస్ జానయ్య

తగ్గించామని వివరించారు. విశ్వవిద్యాలయం లోని ఖాళీ లని ప్రభుత్వ విధానాలకి అనుగుణంగా భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటామని జానయ్య తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటుమన్నారు. తనకి ఎవరితోనూ వ్యక్తిగత విబేధాలు లేవని, విశ్వవిద్యాలయం చట్టం తనకు బైబిల్ అని స్పష్టం చేశారు.తాను పూర్తి ప్రజాస్వామిక విధానాల ని అనుసరిస్తూ నిర్ణయాలు తీసుకుంటానని వివరించారు . ఇదే మాతృక విశ్వవిద్యాలయం అని త్వరలోనే వజరోత్సవం నిర్వహిస్తామని జానయ్య ప్రకటించారు.టాసా అధ్యక్షులు ప్రొఫెసర్ బి. విద్యాసాగర్, బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి అమృత రెడ్డి, విద్యార్థుల ప్రతినిధులు పూజ, బాలకోటి, పూర్వ విద్యార్థుల ప్రతినిధి కవి రాజ్ లు ప్రసంగించారు. జానయ్యని అభినందించారు. ఆయన సారధ్యం లో విశ్వవిద్యాలయం అభివృద్ధి లో సాగాలని, తమ అంశాలని సానుకూలం గా పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.

# అనుకోకుండా వచ్చి.. అగ్ర నటుడిని అయ్యా

## చిత్ర పరిశ్రమకు ఎంట్రీపై సూర్య వెల్లడి



భాషతో సంబంధం లేకుండా అభిమానులను సొంతం చేసుకున్నారు హీరో సూర్య. ఆయన సినిమా వస్తుందంటే కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ సందడి నెలకొంటుంది. ఈ స్టార్ హీరో చిత్ర పరిశ్రమ ఎంట్రీకి సంబంధించి గల కారణాన్ని వివరించారు. తన తల్లి తీసుకున్న బ్యాంక్‌లోన్ తీర్చాలని పరిశ్రమకు వచ్చినట్లు వెల్లడించారు. చదువు అయిపోగానే ఓ గార్మెంట్ కంపెనీలో ఉద్యోగంలో చేరాను. మొదట 15 రోజులకు రూ.750 ఇచ్చారు. మూడు సంవత్సరాల తర్వాత నెలకు రూ.8000 చేశారు. ఏదో ఒకరోజు సొంతంగా కంపెనీ పెట్టాలని అనుకున్నాను. ఇండస్ట్రీలోకి రావాలని ఎప్పుడూ అనుకోలేదు. ఆ సమయంలో మా నాన్నకు తెలియకుండా అమ్మ బ్యాంక్‌లో రూ.25వేలు లోన్ తీసుకున్నట్లు నాతో చెప్పింది. ఆలోన్ తీర్చడం కోసమే మణిరత్నం సినిమాలో అవకాశం రాగానే అంగీకరించా. నేను చిత్రపరిశ్రమలోకి రావాలని, నటుడిగా ఎదగాలని కలలో కూడా అనుకోలేదు. మా అమ్మకు రూ.25వేలు ఇచ్చేసి.. 'మీ లోన్ అయిపోయింది. ఇక బాధపడొద్దు' అని చెప్పేద్దామనుకున్నా.. దాని కోసం నా కెరీర్ ప్రారంభించా.. ఇప్పుడు సూర్యగా ఇంతమంది అభిమానులను సొంతం చేసుకున్నా అని సూర్య చెప్పారు. 1997లో విడుదలైన ఓ నెర్రుక్కు నెర్ అనే తమిళ సినిమా ద్వారా సూర్య ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. వసంత్ దర్శకత్వం వహించిన ఆ సినిమాను మణిరత్నం నిర్మించారు. ఇందులో విజయ్ హీరోగా నటించగా సూర్య కీలకపాత్రలో కనిపించారు. ఈ చిత్రం తర్వాత సూర్య వరుస అవకాశాలు అందుకొని స్టార్‌గా ఎదిగారు. ప్రస్తుతం సూర్య నటించిన 'కంగువా' విడుదలకు సిద్ధంగా ఉంది. శివ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం నవంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల ఈ చిత్రం గురించి సూర్య మాట్లాడుతూ.. 'కంగువా' స్క్రిప్టును డైరెక్టర్ శివ చెప్పినప్పుడే నేను కొత్త ప్రపంచంలోకి అడుగు పెట్టబోతున్నా అని అనిపించింది. లార్జర్ దేన్ లైఫ్ 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్', 'కల్కి 2898 ఏడీ'లాంటి సినిమాలు ఇప్పటికే చూశాం. ఆ విషయంలో కోలీవుడ్‌లో 'కంగువా'తో మేం తొలి అడుగేశాం అనుకుంటున్నా. తమిళ్‌లో ఇప్పటివరకూ ఇలాంటి సినిమా రాలేదు' అని తెలిపారు.



# ఓ సందేశం ఇవ్వాలన్నదే మా తపన

## అందుకే మా చిత్రానికి టాక్సిస్ అని పెట్టాం: యశ్

యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్ దాస్ 'టాక్సిక్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది దీని ట్యాగ్ లైన్. ఇటీవలే దీని షూటింగ్ ప్రారంభమైంది. తాజాగా ఓ మీడియా ఇంటర్వ్యూలో యశ్ మాట్లాడుతూ.. ఈ సినిమాకు 'టాక్సిక్' అనే టైటిల్‌ను తనే సూచించినట్లు చెప్పారు. ఆ టైటిల్ పెట్టడానికి గల కారణాన్ని వివరించారు. పరిశ్రమలో ఇప్పటివరకు పిల్లల కోసం చాలా కథలు తెరకెక్కాయి. కానీ మేము ఈ సినిమాతో పెద్దలకు సందేశం ఇవ్వాలని నిర్ణయించు కున్నాం. అందుకే 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనే ట్యాగ్‌లైన్ పెట్టాం. ప్రస్తుతం మనలో చాలామంది గందరగోళ పరిస్థితుల్లో ఉన్నాం. 'టాక్సిక్' అనే పదాన్ని ఎన్నో సందర్భాల్లో ఉపయోగిస్తాం. మనమందరం కూడా విషపూరిత పరిస్థితుల్లో జీవిస్తున్నాం అందుకే ఈ టైటిల్, ట్యాగ్‌లైన్ చాలా సందర్భోచితంగా అనిపించాయి. కథ వినగానే టైటిల్ సూచించా అని యశ్ చెప్పారు. దర్శకురాలు గీతూమోహన్ దాస్ గురించి యశ్ మాట్లాడుతూ.. ఆమెకు మాస్ పల్స్ తెలుసన్నారు. గతంలో ఆమె ఎలాంటి సినిమాలు చేశారు.. వాటి ఫలితమేంటి? అన్నది కాకుండా ప్రస్తుతం ఏం కథ చెప్పాలనుకుంటున్నారనేది మాత్రమే చూసినట్లు చెప్పారు. ఆమెకు సినిమా అంటే ప్యాషనని.. ఈ చిత్రంలో మహిళా పాత్రలు చాలా ఉన్నాయని వెల్లడించారు. ఆ హీరోయిన్ల వివరాలు త్వరలోనే ప్రకటిస్తామన్నారు. యశ్ 19వ చిత్రంగా 'టాక్సిక్' తెరకెక్కుతుంది. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. 'కేజీఎఫ్' సిరీస్ విజయాల తర్వాత యశ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో దీనిపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలీవుడ్ నటి తారా సుతారియా ఇందులో భాగమయ్యారంటూ జరిగిన ప్రచారాన్ని తాజాగా ఆమె ఖండించారు. కథానాయికలుగా నలుగురు హీరోయిన్ల పేర్లు తెరపైకి వచ్చాయి. మొదట సాయిపల్లవి పేరు బయటకురాగా.. ఆ తర్వాత కరీనాకపూర్, శ్రుతిహాసన్, కియారా అద్వాణీల పేర్లు వైరలయ్యాయి. ఈవిషయంలో అధికారిక ప్రకటన కోసం అందరూ ఎదురుచూస్తున్నారు.

# మీనాకుమారి బయోపిక్‌లో?

బాలీవుడ్ ట్రాజెడీ క్వీన్ మీనా కుమారి జీవిత కథ ఆధారంగా దర్శకుడు సిద్దార్థ్ పి మల్హోత్రా 'కమల్ ఔర్ మీనా' పేరుతో ఓ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాడు. హిందీ కవి, దర్శకుడు కమల్ అమ్రోహితో మీనా కుమారి ప్రేమాయణం మొదలుకొని వారి విఫల దాంపత్య జీవితం వరకు జరిగిన ఆసక్తికరమైన సంఘటనలతో ఈ సినిమాను రూపొందించబోతున్నారు. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా త్వరలో సెట్స్‌మీదకు వెళ్లనుంది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో కియారా అద్వాణీ కథానాయికగా నటించనుందని తెలిసింది. ఇటీవలకాలంలో దర్శకుడు సిద్దార్థ్ పి మల్హోత్రా సోషల్‌మీడియా పోస్ట్‌లకు వరుసగా స్పందిస్తున్నది కియారా అద్వాణీ. ముఖ్యంగా ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్ మొదలుకొని వివిధ ప్రచార చిత్రాలు అద్భుతమంటూ ప్రశంసించింది. ఈ నేపథ్యంలో మీనా కుమారి పాత్రలో కియారా అద్వాణీ నటించడం దాదాపు ఖాయమైందని, చిత్ర బృందం సైతం ఇప్పటికే ఆమెతో చర్చలు జరిపాయని బాలీవుడ్ సినీ వర్గాల్లో వినిపిస్తున్నది.



# డిసెంబర్ 5న పుష్-2

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వం వహిస్తోన్న చిత్రం 'పుష్ప ది రూల్'. 'పుష్ప ది రైజ్'కు సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా విడుదల కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సినిమా విడుదలకు సంబంధించిన వివరాలు తెలియజేస్తూ చిత్ర నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్ గురువారం మీడియా ముందుకు వచ్చారు. సినిమా చిత్రీకరణకు సంబంధించిన విషయాలతోపాటు, రిలీజ్ డేట్ గురించి మాట్లాడారు. అభిమానుల కోరిక మేరకు అనుకున్న డేట్ డిసెంబర్ 6 కంటే ఒక రోజు ముందే డిసెంబర్ 5 దీనిని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. దీనిపై బన్నీ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సుకుమార్ – అల్లు అర్జున్ హ్యాట్రిక్ కాంబినేషన్‌లో 'పుష్ప ది రైజ్' తెరకెక్కింది. రష్మిక కథానాయిక. ఫహద్ ఫాజిల్, సునీల్, అనసూయ కీలక పాత్రలు పోషించారు. మైత్రీ



మూవీ మేకర్స్ పతాకంపై నిర్మితమైంది. ఎన్నో అంచనాల మధ్య 2021లో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టింది. ఈ చిత్రానికి గాను అల్లు అర్జున్ ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డును అందుకున్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో 'పుష్ప' తీర్చిదిద్దారు. కూలీగా తన ప్రయాణాన్ని మొదలుపెట్టిన పుష్పరాజ్.. ఎర్రచందనం సిండికేట్‌ను శాసించే స్థాయికి ఎలా వెళ్లాడనే ఆసక్తికర అంశాలతో 'పుష్ప ది రైజ్' చిత్రీకరించారు. ఆ తర్వాత అతడికి ఎదురైన ఇబ్బందులు ఏమిటి? వాటిని ఎలా ఎదుర్కొన్నాడు? అనే అంశాలతో 'పుష్ప ది రూల్' సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలో ఉంది. రిలీజ్ డేట్ ప్రకటించడంతో త్వరగా చిత్రనిర్మాణం పూర్తి చేసే పనిలో పడ్డారు.

# రష్మిక మందన్నాకు సెక్యూరిటీ పెంపు

కన్నడ సోయగం రష్మి మందన్నా ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉందని తెలిసిందే. కాగా ఈ భామకు సెక్యూరిటీ పెంచారన్న వార్త ఒకటి ఇప్పుడు అటు బీటౌన్, ఇటు టాలీవుడ్‌లో చక్కర్లు కొడుతోంది. ఇంతకీ రష్మిక మందన్నాకు సెక్యూరిటీ పెంచడమేంటను కుంటున్నారా..? దీనిక్కారణం సల్మాన్ ఖాన్‌తో సినిమా చేస్తుండటమే. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపు మెసేజ్‌తో అప్రమత్తమైన ముంబై పోలీసులు సల్మాన్ ఖాన్ ఇంటిదగ్గర భద్రతను పటిష్టం చేశారని తెలిసిందే. ఖాన్ సెక్యూరిటీ టీం, పోలీసుల బృందం భద్రతా చర్యలను పర్యవేక్షిస్తుంది. కాగా సెక్యూరిటీ మధ్యే సల్మాన్ ఖాన్ షూటింగ్స్‌కు హాజరవుతున్నాడు. సల్లూ భాయ్ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి. ఏఆర్ మురుగదాస్ డైరెక్ట్ చేస్తున్న సికిందర్. రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో రష్మికకు కూడా భద్రతను పెంచారట.. సికిందర్ సెట్స్‌లో అదనపు భద్రతా బలగాలను ఏర్పాటు చేసినట్టు బీటౌన్ సర్కిల్ సమాచారం. సల్మాన్ ఖాన్, రష్మిక మందన్నా కాంబినేషన్‌లో వస్తోన్న తొలి సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా తెరకెక్కిస్తున్నారు. సికిందర్ ప్రపంచవ్యాప్తంగా 2025 ఈద్ కానుకగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ కీలక పాత్రలో నటిస్తోంది.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.